క్లుప్తంగా

పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: పిల్లల ప్రవర్తనను గమనిస్తూ వారు సక్రమమైన మార్గంలో నడిచేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఎంఈఓ సుభాన్ సూచించారు. శనివారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పిల్లలను పోషించడంతోనే బాధ్యత తీరిపోదని, వారు ఉన్నత విద్యావంతులుగా ఎదగడానికి తోడ్పాటును అందించాలన్నారు. గతంలో ఉపాధ్యాయులను చూసి పిల్లలు భయపడే వారని, నేడు ఆ పరిస్థితులు లేవన్నారు.చెడు వ్యసనాలకు ఆకర్షితులై భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు జాగ్రత్త పడి వారి ఆడంబరాలకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం తైమూర్ బాషా మాట్లాడుతూ పిల్లలకు నైతిక విలువలను నేర్పించాలని కోరారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో...



అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో శనివారం పలువురు ఉన్నతాధికారులు పూజలు నిర్వహించారు. నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ రమణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రామాంజనేయులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే పోస్టల్ శాఖ జనరల్ మేనేజర్, బెంగళూరు పీఎం శరవణన్ కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజలు అనంతరం వారికి స్వామి అమ్మవారి ప్రసాదాలు అందజేసి వేదపండితుల ఆశీర్వచనం చేయించారు.

వైభవంగా స్వాతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. లక్ష్మీదేవి అమ్మవారికి ఆకుపూజ,సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అర్చకులు రామానుజన్, దేవాలయ నిర్వాహకులు మధుసూదన్ రాయలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించొద్దు

కొత్తపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి శనివారంతో గడువు ముగిసినందున ఎవరూ ప్రచారం నిర్వహించరాదని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ శనివారం తెలిపారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

మిడుతూరు:ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ రమేష్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఆయనమాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఉగాది నాటికి పూర్తిచేసుకోవాలని సూచించారు. వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారికి బిల్లులు పెండింగ్‌లేకుండా ఎప్పటికప్పుడు ప్రభుత్వం మంజూరు చేస్తోందని చెప్పారు. నిర్మాణాలు పూర్తి చేసుకుంటే లబ్ధిదారులకు ఇళ్లు, స్థలంపై సంపూర్ణ హక్కులు లభిస్తాయన్నారు.

కుక్కలు బాబోయ్ !

- పట్టణ ప్రజలను బెంబేలెత్తిస్తున్న శునకాలు
- కుక్కకాటుకు గురవుతున్న వృద్ధులు, చిన్నారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



పట్టణంలోని ఓ విధిలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

ఆత్మకూరు: పట్టణంలో కుక్కల బెడదకు ప్రజలు హడలి పోతున్నారు. పట్టణంలోని 24 వార్డుల్లోని ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. తరచూ ఎవరో ఒకరు కుక్కకాటు బారిన పడుతుండటం, ఇటీవల పిల్లలపై, వృద్ధులపై వాటి దాడులు ఎక్కువవ్వడంతో జనాలు ఇళ్ల నుంచి రావాలంటే జడుసుకుంటున్నారు. కుక్కల బెడద నుంచి రక్షించాలని మున్సిపల్ అధికారులకు కోరుతున్నా పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

రెండు వేలకు పైగా కుక్కలు

ఆత్మకూరు పట్టణంలో దాదాపు 2 వేలకు పైగా వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. ప్రధానంగా పట్టణంలో కొత్తపేట, వాకిలిపేట, ఎస్పీజీ పాలెం, ఏబీయం పాలెం, ఇందిరానగర్, అర్బన్‌కాలనీ, వెంగళరెడ్డి నగర్, రహమత్‌నగర్ , ఏకలవ్యనగర్ ,సాయిబాబనగర్, మెయిన్ బజార్, తదితర కాలనీల్లో కుక్కల బెడద అధికంగా ఉంది.

వేధిస్తున్న కుక్కల బెడద

పట్టణంలో ఇటీవల కుక్కల బెడద అధికం కావడం వలన ప్రజలు బయటికి వచ్చేందుకు వణికిపోతున్నారు. బైకులు, సైకిళ్లు వేసుకుని వెళ్లినా వాటి వెంట కుక్కలు పడడంతో పలువురు గాయాలపాలయ్యారు. ఈ నెలలో ఇప్పటి వరకు ఐదుగురు కుక్క కాటుకు గురయ్యారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు 20 మందికి పైగానే కుక్కల దాడిలో గాయపడ్డారు. ఇటీవల వీధుల వెంట, జనావాసాలు అధికంగా ఉన్న పాతబస్టాండ్, కొత్తపేట మసీదు, నంద్యాల టర్నింగ్, లాంటి ప్రాంతాల్లో కూడా అధికంగా సంచరిస్తూ ప్రజలకు కాటువేస్తుండడంతో ప్రజలు మరింత ఆందోళన గురవుతున్నారు. గతేడాదిలో ఇంటి నుంచి తినుబండారాల కోసం దుకాణానికి వెళ్లిన ఓ చిన్నారిని తీవ్రంగా కుక్కలు గాయపరిచిన సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. ఈ సంఘటనపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి పట్టణంలో శునకకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

కౌన్సిల్ సమావేశంలో చర్చించినా ఫలితం శూన్యం

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద అధికంగా ఉందని, మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రధానాంశంగా చర్చించారు. ఆ సమావేశంలో మున్సిపల్ అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. పలు కాలనీల ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందిచినా అధికారుల నుంచి స్పందన కరువైంది. ఫలితంగా ఇళ్ల నుంచి బయటికి వెళ్లిన వారు సురక్షితంగా వస్తారా లేదా అని ఆందోళన పట్టణ వాసుల్లో నెలకొంది.

ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయమేస్తుంది



పట్టణంలో కుక్కలు అధికంగా ఉండడం వలన ఇంటి నుంచి బయటికి రావాలంటే భయమేస్తోంది. ఏ వీధిలో చూసి నా కుక్కల సంచారం అధికమైంది. ప్రజలు అధికంగా సంచరించే ప్రధాన కూడళ్లలో కూడా అధికంగా ఉన్నాయి. ఎప్పుడు కాటు వేస్తాయోనని ఆందోళనకు గురవుతున్నాం. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది.

-బాషా, ఆత్మకూరు

చర్యలు తీసుకుంటున్నాం



పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉన్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. కుక్కల నియంత్రణకు జిల్లా అధికారులతో చర్చించి, త్వరలోనే కుక్కలను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటాం. అవసరం అయితే పశువైద్యశాల అధికారులతో చర్చించి కుక్కలకు టీకాలు వేయిస్తాం.

– శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

పోలింగ్‌కేంద్రం వద్ద సంచరించొద్దు

పాములపాడు: ఈ నెల 13న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎవరూ సంచరించరాదన్నారు. పోలింగ్ బూత్‌లోకి సెల్ ఫోన్లు అనుమతించబడవని చెప్పారు. పోలింగ్ కేంద్రం వద్ద ఇద్దరు ఏఎస్ఐలు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్, పోలీసులు, మహిళా పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని మండల విద్యాధికారి శ్రీరాములు అన్నారు. శనివారం స్థానిక హరిజనవాడలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా అడ్మిషన్ రిజిష్టర్‌ను, ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన రిజిష్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయాన్ని పాటించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందిస్తే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలవైపు ఆకర్షితులవుతారన్నారు. ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం నాడు–నేడు పథకంను ప్రవేశపెట్టిందన్నారు. అంతేకాకుండా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు రక్షణ చర్యల కోసం ఫైర్‌ప్రొటెక్షన్ సిలిండర్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మండలానికి 24 సిలిండర్లు మంజూరు అయ్యాయన్నారు. హెచ్‌ఎం ఎం.మహేశ్వర రావు పాల్గొన్నారు.

ఏదైనా గుర్తింపు కార్డు చూపించాలి



ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజశేఖర్‌బాబు

నందికొట్కూరు: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల్లో ఓటరు గుర్తింపు కార్డు లేని ఓటర్లు ప్రత్యామ్నాయంగా పది పత్రాల్లో ఏదైనా చూపించవచ్చని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిశోర్ తెలిపారు. శనివారం పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు తహసీల్దార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటర్లు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు జారీ చేసిన సర్వీసు గుర్తింపు కార్డ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికారిక గుర్తింపు కార్డు, విద్యా సంస్థలు జారీ చేసిన సర్వీసు గుర్తింపు కార్డు, విశ్వవిద్యాలయాలు జారీ చేసిన డిగ్రీ, డిప్లొమా ఒరిజినల్ ధ్రువపత్రం, వికలాంగుల ధ్రువపత్రం, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ జారీ చేసిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించవచ్చన్నారు. సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. టౌన్ సీఐ విజయభాస్కర్, ఎస్ఐ ఎన్వీ రమణ, డీటీ సత్యనారాయణ, వీఆర్వో వెంకటేశ్వరు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



బందోబస్తు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు సర్కిల్ పరిధిలోని జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పదిమంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బందోబస్తు కేటాయింపు ప్రక్రియను పూర్తిచేశామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద ఓ ఎస్ఐ, ఇద్దరు ఏఎస్సైలు, ఏడుగురు పోలీసు కానిస్టేబుళ్లను నియమించినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే వారిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి పంపిస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా ఉపేక్షించేదిలేదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది కనుక ఓటువేయటానికి వచ్చిన వారెవ్వరూ గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. ఓటువేసిన వెంటనే పోలింగ్ కేంద్రం పరిసరాల నుంచి వెళ్లిపోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే పోలింగ్ సరిళితో పాటు కేంద్రాలను నిరంతరం పది మందితో కూడిన మొబైల్ స్పెషల్ స్క్వాడ్ పోలీసుల బృందం పరిశీలిస్తుందని వివరించారు.

మద్యం, కల్లుదుకాణాలు తెరిస్తే కఠినచర్యలు

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంతో ఈనెల 11తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4గంటల వరకు ఎవ్వరూ మద్యం, కల్లుదుకాణాలు తెరవరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను వ్యతిరేకించి ఎవ్వరైనా అక్రమంగా మద్యం , కల్లు విక్రయాలు చేసినట్లు తెలిస్తే సంబంధిత వ్యక్తిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఈనెల 16న ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున ఆరోజున కూడా మద్యం , కల్లు దుకాణాలు మూసివేయాలని సూచించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



వెలుగోడు: మాధవరం గ్రామంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. శిథిలావస్థకు చేరిన రెండు స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద స్తంభం కింది భాగంలో పెచ్చులూడి కడ్డీలు బయటపడ్డాయి. అలాగే వన్నెం వెంకటేశ్వర్లు ఇంటి వద్ద స్తంభం మధ్యలో విరిగిపోయింది. రద్దీ ప్రాంతం కావడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. ఈ విషయంపై ఏఈ రవీంద్రనాయక్‌ను వివరణ కోరగా కొత్త స్తంభాలు మంజూరు అయ్యాయని, త్వరలోనే శిథిలావస్థకు చేరిన స్తంభాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం శనివారం దేవస్థానం పరిపాలనా భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో రెడ్డివారిచక్రపాణిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని అనుసరించి ఎలక్షన్ కమిషనర్‌తో ప్రత్యేక అనుమతి తీసుకుని ధర్మకర్తల మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దేవస్థాన అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ సహాయ కమిషనర్ హెచ్‌జి వెంకటేష్, అన్ని యునిట్ విభాగాల అధికారులు పర్యవేక్షకులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానంతో సరిపెట్టకుండా పార్లమెంట్ కమిటీ వేసి కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తీసుకోవాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయ పులికొండన్న కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోయల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శామ్యూల్ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించడం హర్షనీయమన్నారు. కమిషన్ రిపోర్టు రెండు రోజుల్లో ప్రభుత్వానికి చేరనుందన్నారు. ఈ రిపోర్టుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతారని, ఆ తరువాత పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు.నాయకులు సుబ్బరాయుడు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- పోలింగ్‌కు సర్వం సిద్ధం చేస్తున్న అధికార బృందం



ఆత్మకూరు జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సోమవారం పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ముగిసింది. స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం పరిధిలోని శ్రీశైలం, ఆత్మకూరు , వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వార్డు కౌన్సిలర్లు ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల అభ్యర్థి మధుసూదన్‌ల గెలుపు కోసం ఓటర్లను అభ్యర్థించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయ పరిధిలోని అధికారులు, తహసీల్దార్లు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆత్మకూరు డివిజన్ మొత్తం గ్రాడ్యుయేట్స్ ఓట్లు 14,722, టీచర్ల ఓట్లు 962 ఓట్లు ఉన్నాయి. గ్రాడ్యుయోట్లకు వివిధ మండలాల్లో కలిపి 16 పోలింగ్ కేంద్రాలు, టీచర్లకు 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం పరిధిలో ప్రజాప్రతినిధిలు, ఆత్మకూరు నందికొట్కూరు డివిజన్‌పరిధిలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు 165 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల అదనపు రిటర్నింగ్ ఆఫీసర్‌గా డీఆర్‌ఓ పుల్లయ్యను నియమించారు. పుల్లయ్య ఆధ్వర్యంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు ఎన్నికల ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు.

కట్టుదిట్టమైన భద్రత

బొమ్మలసత్రం: జిల్లా వ్యాప్తంగా రేపు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు 590 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి శనివారం కో ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భద్రత కట్టుదిట్టం చేశామన్నారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లరాదని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుంపులుగా సంచరిస్తే చర్యలు

పగిడ్యాల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈనెల 13వ తేదీన పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులు గుంపులుగా సంచరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున శనివారం తెలిపారు. మండల కేంద్రమైన పగిడ్యాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు సుమారు 200 మీటర్ల వరకు ఎవరికీ ప్రవేశం లేదన్నారు. కేవలం ఓటర్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. మద్యం దుకాణాలు మూసివేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని పట్టువస్త్రాలతో ముస్తాబు చేశారు. అనంతరం నవగ్రహ, గణపతి హోమాలు చేపట్టి పూర్ణాహుతి గావించారు. వేదపండితులు ప్రతాప్‌శర్మ,ఆలయ నిర్వాహకులు తిరువీధి సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలి

కోవెలకుంట్ల: ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త బోధనలను అనుసరించాలని కర్నూలుకు చెందిన మత పెద్దలు మౌలానా బసిత్‌సాబ్, మౌలానా రహంతుల్లా సూచించారు. స్థానిక ముదిగేడు చౌరస్తా సమీపంలోని షాదీఖాన ఆవరణలో శనివారం ఇస్తేమా నిర్వహించారు. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన సుమారు 2 వేల మంది ముస్లిం సోదరులు ఇస్తేమాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కాబోతోందన్నారు. ప్రతి ఒక్క ముస్లిం రోజు ఐదు పూటలా నమాజ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల, కోవెలకుంట్లకు చెందిన మత పెద్దలు ఖలీల్, రహీల్, యాసిన్ మౌలానా, సలామ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలోకి మహిళ

- జిల్లాలో రెండు మహిళా మార్ట్‌లు
- పాణ్యం, బేతంచెర్లలో ఏర్పాటు
- ఉగాది నాటికి ప్రారంభించేలా పనులు
- 18 వేల మంది మహిళలకు భాగస్వామ్యం
- తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు

గతంలో మహిళలను కేవలం ఓటు బ్యాంకుగానే వినియోగించుకున్నారు. ఓట్ల సమయంలో మాత్రమే వారికి తాయిళాలు ప్రకటించి, అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోకపోవడం రివాజుగా మారింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి స్థలం నుంచి దాదాపు 95శాతానికి పైగా సంక్షేమ పథకాలు వారిపేరుతోనే అందజేస్తోంది. ఇక నామినేటెడ్ పోస్టులు, రాజకీయ పదవులు, కాంట్రాక్టులు ఒకటేమిటి అన్నింట్లోనూ వారికి సగానికి పైగా కేటాయింపులు చేపట్టింది. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసి డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో మహిళా మార్టులు ప్రారంభించనుంది. పాణ్యం, బేతంచెర్లలో ఉగాది నాటికి ప్రారంభించాలని నిర్ణయించింది. వారిని వాటాదారులుగా ఉంచి, తయారీదారులతో ప్రభుత్వమే నేరుగా చర్చించి వారికి తక్కువ ధరలకు వస్తువులు అందజేసేలా చర్యలు తీసుకుంది.




బేతంచర్లలో మహిళా మార్ట్ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు (ఫైల్)

నంద్యాల: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో మహిళలే వాటాదారులుగా ఉంటూ అన్ని రకాల వస్తువులను విక్రయిస్తారు. తద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు వారికి అవకాశం కల్పిస్తారు. ప్రభుత్వం మహిళలను వ్యాపార రంగంలో భాగస్వాములను చేసి ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తోంది. ఇందులో భాగంగా డ్వాక్రా మహిళలతో చేయూత మహిళా మార్టులను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసింది. నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల, పాణ్యం నియోజకవర్గాల కేంద్రాల్లో మహిళా మార్టులను ప్రారంభించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మహిళా మార్టుల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఒక్కో మార్టు రూ.35లక్షలతో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. బేతంచర్ల మహిళా మార్టును ఉగాది నాటికి ప్రారంభించడానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. చేయూత మహిళా మార్టులో నిత్యావసర వస్తువులు మార్కెట్ రేటు కంటే తక్కువగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. బ్రాండెడ్ వస్తువులు, సరుకుల అమ్మకాలను చేపడతారు. వస్తువుల తయారీదారులతో ప్రభుత్వమే నేరుగా మాట్లాడి మహిళా మార్టులకు ఆయా వస్తువులు లేదా సరుకులను తక్కువ ధరలకు అందించేలా చర్యలు తీసుకుంటుంది. మహిళా మార్టులలో ప్రజలకు తక్కువ ధరకే వస్తువులు విక్రయించనున్నారు.

రూ.310తో షేర్ ధనం..

మహిళా మార్టు ఏర్పాటు చేసిన నియోజకవర్గ కేంద్రాల్లో ఆ మండలానికి చెందిన మహిళలే షేర్ ధనం రూపంలో పెట్టుబడి పెట్టడానికి అర్హులు. బేతంచర్ల, పాణ్యం నియోజకవర్గ కేంద్రాల్లో 18 వేల మంది మహిళలు భాగస్వాములుగా ఉన్నారు. వీరు మహిళా మార్టులో రూ.310 వాటా ధనంతో షేర్ పెట్టుబడి పెట్టారు. వీరందరికి భాగస్వామ్యంతో మహిళా మార్ట్‌లో నిత్యావసర సరుకులు, బ్రాండెడ్ వస్తువులు, దుస్తులు, గృహాలకు ఉపయోగించే వస్తువులు విక్రయిస్తారు. ఈ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం పెట్టుబడి పెట్టిన మహిళలకు వాటాల ప్రకారం లాభాలను అందిస్తారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకే..



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేయూత మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంది. జిల్లాలో ముందుగా పాణ్యం, బేతంచర్లలో మహిళా మార్ట్‌లను త్వరలో ప్రారంభించనున్నాం. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా మార్టులు ఉపయోగపడుతాయి. ఇవి పూర్తిగా డ్వాక్రా మహిళల వాటా ధనంతో ఏర్పాటు చేస్తున్నాం. బ్రాండెడ్ వస్తువులు, నిత్యావర సరుకులు వాటిల్లో అందుబాటులో ఉంటాయి. బేతంచర్ల, పాణ్యం మహిళా మార్టును ఉగాది రోజు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల